# వివాహములను చెల్లునట్లుచేయు చట్టము, 1892

## (1892 లోని 2వ చట్టము)

(29వ జనవరి 1892)

భారత క్రైస్తవ వివాహ చట్టము 1872 లోని 6వ భాగము క్రింద జరుపబడిన కొన్ని వివాహములను చెల్లునట్లు చేయుటకైన చట్టము.

భారత క్రైస్తవ వివాహచట్టము, 1872 యొక్క 6వ భాగములో ఉభయులును భారతీయ క్రైస్తవులైన వ్యక్తుల మధ్య వివాహములను మాత్రమే జరిపించుటకు నిబంధనలు చేయబడి ఒకరు భారతీయ క్రైస్తవులై యుండి రెండవవారు కానట్టి వ్యక్తుల మధ్య వివాహములను జరుపుటకు నిబంధనలు చేయబడనందునను ;

మరియు ఒకరు భారతీయ క్రైస్తవులైయుండి రెండవవారు భారతీయ క్రైస్తవులు కాని వ్యక్తుల మధ్య వివాహములను సదరు చట్టము యొక్క 9వ పరిచ్ఛేదముక్రింద లైసెన్సు పొందిన వ్యక్తులు, శాసన పరిజ్ఞానము లేనందు వలన భారత దేశములో అనేకచోట్ల సదరు భాగము క్రింద తమ సమక్షమున జరిపించియున్నందునను :

మరియు అట్టి వివాహములు సద్భావ పూర్వకముగ జరుపబడి నందున చెల్లునట్లుచేయుట సముచితమై నందునను

ఇందుమూలముగ ఈ క్రింది విధముగ శాసనము చేయబడినది :

ప్రారంభము.

1. రద్దు మరియు సవరణ చేయు చట్టము 1914 (1914లోని 10వ చట్టము ) లోని 3వ పరిచ్ఛేదము మరియు II వ అనుసూచిచే రద్దు చేయబడినది.

నిర్వచనము.

2. ఈ చట్టమునందు "భారతీయ క్రైస్తవుడు" అనుపదబంధము భారత క్రైస్తవ వివాహ చట్టము, 1872లో దానికి గల అర్థమునే కలిగి యుండును.

క్రమరహిత వివాహములను చెల్లునట్లు చేయుట.

3. భారత క్రైస్తవ వివాహ చట్టము, 1872 యొక్క 6వ భాగము క్రింద ఇంతకు పూర్వమే జరుపబడిన వివాహము లన్నియు దంపతు లిరువురిలో ఒకరు మాత్రమే భారతీయ క్రైస్తవులై యున్నను, అట్టి వివాహములు వారిరువురును భారతీయ క్రైస్తవులై యుండిన యెట్లో అట్లే శాసన దృష్ట్యా సరియైనవిగను, చెల్లునవిగను ఉండును.

అయితే అట్టి వివాహము ప్రభావ శూన్యమైనదని న్యాయికముగ ప్రఖ్యానించబడిన సందర్భమునను, లేక అట్టి వివాహము జరిగినప్పటినుండి ఈ చట్టము ప్రారంభమగుటకు పూర్వము దంపతులిరువురిలో ఎవరైనను చెల్లదగు వివాహమును చేసికొని యుండిన సందర్భమునను ఈ పరిచ్ఛేదములోని దేదియు వర్తించదు.

క్రమరహిత వివాహముల రికార్డు లను చెల్లునట్లు చేయుట.

4. పై కడపటి పరిచ్ఛేదము ద్వారా శాసన దృష్ట్యా సరియైనవనియు చెల్లదగినవనియు ప్రఖ్యానింపబడిన వివాహములను గూర్చి సర్టిఫికెట్లను, తత్సమయమున అమలునందున్న శాసనము ననుసరించి ఉంచబడిన రిజిస్టర్లను వాటినుండి తీసికొనబడి తగు రీతిగ అధిప్రమాణీకరించబడిన వాస్తవ ఉద్ధరణముల ధ్రువీకృత నకళ్లను పైన చెప్పబడినట్టి వివాహములకు సంబంధించినంత మేరకు, ఇరువురు భారతీయ క్రైస్తవులైన వ్యక్తుల మధ్య అట్టి వివాహములు జరిగియుండిన ఎట్లో అట్లే, ఆ వివాహములను గూర్చి సాక్ష్యముగ స్వీకరించవలెను.

1865లోని 5వ చట్టముక్రింద వివాహములకు చట్టము యొక్క వర్తింపు.

5. భారత క్రైస్తవ వివాహ చట్టము, 1872 ను గూర్చి ఈ చట్టములో చేయబడిన నిర్దేశములను, వలసినంత మేరకు, భారత వివాహ చట్టము, 1865 యొక్క తత్తుల్య భాగములకు వర్తించునట్లు అన్వయించవలెను.

క్రమరహిత వివాహములు జరిపించినవారిని శాస్తి.

6. భారతీయ క్రైస్తవుల మధ్య జరుగు వివాహములకు వివాహ సర్టిఫికేటులను మంజూరు చేయుటకు సదరు చట్టము యొక్క 9వ పరిచ్ఛేదము క్రింద లైసెన్సు పొందిన ఏ వ్యక్తి యైనను, ఈ చట్టము ప్రారంభమైన తరువాత వివాహము చేసికొను ఇరు పక్షములలో ఒకరు వివాహ దినమున భారతీయ క్రైస్తవులు కారని తెలిసి యుండియు, సదరు చట్టము యొక్క 6వ భాగము క్రింద ఎప్పుడైనను అట్టి వివాహము జరిపించినచో లేక జరిపించజూచినచో, లేక అందు చెప్పబడినట్లు ఏదేని సర్టిఫికేటు మంజూరు చేసినచో, ఆ వ్యక్తి యొక్క లైసెన్సు రద్దు చేయబడును :

అంతేగాక, సదరు చట్టము యొక్క 73వ పరిచ్ఛేదముక్రింద నిషేధింపబడిన అపరాధము చేసినట్లు భావింపబడి తదనుసారముగ అతడు శిక్షింపబడదగియుండును.